క్లుప్తంగా

ఘనంగా సీవీ రామన్ జయంతి

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం సర్ సీవీ రామన్ జయంతి నిర్వహించారు. కళాశాలలోని ఆయన విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు పూలమాల వేసి నివాళులర్పించారు. రామన్ జీవిత చరిత్ర ఆధారంగా భౌతిక శాస్త్ర విద్యార్థులు వేసిన చిత్రాలను ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మేడం క్యూరీ జయంతి

స్థానిక నెహ్రూనగర్ పాఠశాలలో మంగళవారం మేడం క్యూరీ జయంతి నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు నోబెల్ బహుమతులు సాధించిన ఘనత మేడం క్యూరీదన్నారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

సెలవులు కచ్చితంగా ఇవ్వాలి

కంబాలచెరువు: ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలు శని, ఆదివారాలు సెలవులు కచ్చితంగా ఇవ్వాలంటూ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాంకి ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ (పీటీఏయూ) జిల్లా శాఖ నాయకులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల పాఠశాల విద్య కమిషనర్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో చర్చించి స్కూల్ సిబ్బంది పనివేళల్లో మార్పు చేసిందన్నారు. ప్రభుత్వ సెలవు దినాలతో పాటు రెండో శనివారం, ఆదివారం సిబ్బందికి కచ్చితంగా సెలవు ఇవ్వాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి దిద్దే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవలపై పోటీలు

కంబాలచెరువు: జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్కేవీటీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం పోటీలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి ఆదేశాల మేరకు విద్యార్థులకు న్యాయ సేవలపై అవగాహన కోసం వివిధ పోటీలు నిర్వహించామని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు.

విద్యార్థుల గైర్హాజరుపై ఆగ్రహం

కంబాలచెరువు: స్థానిక దానవాయిపేట మునిసిపల్ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎక్కువమంది విద్యార్థులు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల గైర్హాజరుకు కారణాలు తెలుసుకుని నివేదిక అందజేయాలని హెచ్ఎంను ఆదేశించారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలించారు. మూడు రోజుల పాటు మండల స్థాయి పర్యవేక్షక బృందాలు పాఠశాలలను తనిఖీ చేస్తాయన్నారు. .

శాస్త్ర ప్రచార ఉద్యమం ఆరంభం

కంబాలచెరువు: ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ పిలుపు మేరకు జన విజ్ఞాన వేదిక నిర్దేశించిన దేశ వ్యాప్త శాస్త్ర ప్రచార ఉద్యమం మంగళవారం స్థానిక ఆనంద్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. దీనిని ఆ సంస్థ అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు ప్రారంభించారు. కోశాధికారి ఎన్.రవిబాబు మాట్లాడుతూ మన ప్రముఖ శాస్త్రవేత్తలు, నోబెల్ బహుమతి గ్రహీతలు సీవీ రామన్, మేరీ క్యూరీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో మంగళవారం శాస్త్ర ప్రచార ఉద్యమం ఆరంభమైందన్నారు. హెచ్ఎం బీఏ శాంతకుమారి పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిపై పరిశోధనలు

రాజమహేంద్రవరం రూరల్: గిరిజన సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలపై సమూల పరిశోధన చేయాలని ట్రైబర్ కల్చరల్ రీసెర్చ్, ట్రైనింగ్ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు అన్నారు. బొమ్మూరులోని గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కేఎస్ జ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం ఆయన గిరిజన సంస్కృతిపై పరిశోధనపై వచ్చిన ప్రత్యేక బృందం ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. చినబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అలనాటి వస్తువులు, వారి సంప్రదాయాలు ఎంతో ముఖ్యమన్నారు. గిరిజనులు వాడే సంప్రదాయ వస్తువులు, ముఖ్యమైన చిహ్నాలు సేకరించి లంబసింగిలో త్వరలో ఏర్పాటు చేయబోయే మ్యూజియంలో పొందుపరచాలన్నారు. సమావేశంలో మ్యూజియం ప్రొఫెసర్ పి.శంకరరావు, పరిపాలనాధికారి వి.సునీత, ఫీల్డ్ ఆఫీసర్ అనురాధ పాల్గొన్నారు.

వ్యక్తికి ఏడాది జైలు

కంబాలచెరువు: మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఐదవ ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకెళితే...రాజమహేంద్రవరం మెయిన్ రోడ్ లోని ఒక దుస్తుల దుకాణంలో పనిచేసే ఒక వివాహిత పని ముగించుకుని.. 2020 ఫిబ్రవరి మూడున తన మోటార్ సైకిల్‌పై ఒంటరిగా కొంతమూరు వెళుతోంది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ఖండవిల్లి రాజేష్ అలియాస్ పండు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి, తన కోరిక తీర్చమని వేధించాడు. దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో గాయపర్చాడు. దీనిపై బాధితురాలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బీజేపీ బలోపేతానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం యువమోర్చా జిల్లా కమిటీని అధ్యక్షుడు కందికొండ రమేష్ ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులకు బొమ్ముల దత్తు నియామక పత్రాలు అందించారు.

శరవేగంగా రహదారి నిర్మాణం

- రూ.1.60 కోట్లతో పనులు
- తీరనున్న వాంబే కాలనీ వాసుల కష్టాలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆవ వాంబే కాలనీ వాసులకు నడక యాతన తప్పింది. గతంలో తుప్పల్లో నుంచి కాలిబాటలో రాకపోకలు సాగించేవారు. వారి కష్టాలను చూసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆవ వాంబే కాలనీ యూపీహెచ్‌సీ సెంటర్ నుంచి షెల్టాన్ వరకూ రూ.1.60 కోట్లతో 30 అడుగుల బీటీ రోడ్డును మంజూరు చేసింది. అంతే కాకుండా పనులను సైతం శరవేగంగా చేపడుతున్నారు.

రాకపోకలకు అవస్థలు

ఆవ వాంబే కాలనీలో సుమారు రెండువేల కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరు నిత్యం రాజమహేంద్రవరం నగరంలో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఎవరు వెళ్లాలన్నా మేకల కబేళా వీరభద్రపురం రోడ్డులోనే ప్రయాణించాల్సి వచ్చేది. లేకపోతే వాంబే గృహాల మధ్య ఉన్న చెట్ల తుప్పల మధ్య ఉన్న కాలిబాట రహదారి మీదుగా షెల్టాన్ హోటల్ రోడ్డులో ప్రయాణించేవారు. అయితే రాత్రి సమయంలో ఇంటికి తిరిగి రావాలంటే భయపడేవారు.



నిర్మాణంలో ఉన్న వాంబే కాలనీ - షెల్టాన్ రోడ్డు

నిధుల మంజూరు

వాంబే కాలనీ వాసుల కష్టాలను తెలుసుకున్న ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఈ విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఇటీవల అభివృద్ధి పనుల్లో భాగంగా ఆవ వాంబే కాలనీ నుంచి షెల్టాన్ హోటల్ వరకూ. రూ.1.60 కోట్లతో 30 అడుగుల బీటీ రోడ్డును మంజూరు చేశారు.



వాంబే కాలనీ వద్ద డ్రైనేజీలపై నిర్మిస్తున్న కల్వర్టు

చురుకుగా పనులు

వాంబే కాలనీ నుంచి హోటల్ షెల్టాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరుగుతోంది. తర్వాత రెండు లేయర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపడతారు. అలాగే వాంబే కాలనీ వద్ద రెండు డ్రైనేజీలపై కల్వర్టు నిర్మాణం కూడా పూర్తయింది. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు కష్టాలు తీరనున్నాయి.

> **త్వరితగతిన..**
> వాంబే కాలనీ నుంచి షెల్టాన్ హోటల్ వరకూ 30 అడుగుల బీటీ రోడ్డు నిర్మాణం రూ.1.60 కోట్లతో జరుగుతోంది. ఇప్పటి వరకూ గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. త్వరితగతిన పనులు జరుగుతున్నాయి. డ్రైనేజీలపై కల్వర్టుల నిర్మాణం పూర్తయ్యింది.
> – శ్రీధర్, నగరపాలకసంస్థ ఏఈ, రాజమహేంద్రవరం

ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా

- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్
- బొమ్మూరులో వైద్యశిబిరం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరు సచివాలయం-3లో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్యసేవలపై ప్రజలను ఆరా తీశారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీదైన వైద్యాన్ని పేదలకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చందన చేయూత ట్రస్టు ఆధ్వర్యంలో రోగులకు భోజన సదుపాయం కల్పించారు. స్పెషలిస్టు వైద్యులు రవికాంత్, తేజ్ కిరణ్, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యులు మేరీ లిడియా సుచిత్ర, కె.నాగదేవి, స్వరూప వైద్యసేవలు అందించారు. 522 మంది వైద్యసేవలను వినియోగించుకోగా 10 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలకు రిఫరల్ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, గ్రామ పార్టీ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజు, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్లు మరడాపు శేఖర్, కేవీ సుబ్బారెడ్డి, సోమన శ్రీనివాస్, వాసంశెట్టి వీరంశెట్టి, పీవీ రమణ, కాకులపాటి కుమార్, వల్లి శ్రీను, తోడేటి రాహుల్ పాల్గొన్నారు.



బొమ్మూరులో వైద్యసేవలపై ఆరా తీస్తున్న చందన నాగేశ్వర్

డ్రైనేజీలతో ముంపు సమస్యకు పరిష్కారం

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- 42వ డివిజన్‌లో పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: డివిజన్ల పరిధిలో మేజర్ డ్రైనేజీలకు అనుబంధంగా ఉన్న చిన్న డ్రైనేజీలను పక్కాగా నిర్మిస్తే వీధుల్లో ముంపు సమస్య ఉండదని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 42వ డివిజన్ ఇన్‌చార్జి నామన వాసు ఆధ్వర్యంలో మంగళవారం నాలుగో వీధి దుర్గమ్మ గుడి ప్రాంతంలో పర్యటించారు. స్థానిక మార్కెట్ యార్డు వెనుక ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. బీవీఎం స్కూల్ సమీపంలో రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గోతులను కాంట్రాక్టర్ తక్షణం పూడ్చడంతో పాటు ఆ ప్రాంతంలో శంకుస్థాపన చేసిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మున్సిపల్ కాలనీ పార్కును తక్షణం శుభ్రం చేయించాలని సూచించారు. మున్సిపల్ కాలనీ పార్కులో కాపలాదారులను ఏర్పాటు చేసేలా ఏడీహెచ్ చర్యలు తీసుకోవాలన్నారు. వీధిలో లైట్లు ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట జాలా నటరాజు, సబ్బారపు సూరిబాబు తదితరులు ఉన్నారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: చిత్రలేఖనంతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను సులువుగా గుర్తించవచ్చని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాం సుందర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ప్రపంచశాంతి అనే అంశంపై రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థులను కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితం చేయకుండా అన్ని అంశాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. గురుకులం ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ మనసులోని వెయ్యి భావాలను ఒక్క చిత్రం ద్వారా గుర్తించవచ్చన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానం సాధించిన గురుకులం విద్యార్థులు ఆర్.హర్షిత్ (9వ తరగతి), కె.ప్రశాంత్ కుమార్ (9వ తరగతి), బి.అఖిలసాయి సంజన (8వ తరగతి)ను లయన్స్ క్లబ్ సభ్యులు గ్రంధి వసంత కుమారి, ఏవీఎస్ సత్యనారాయణ, ఎన్.సతీష్ సత్కరించారు. న్యాయ నిర్ణేతలుగా మోటూరి శ్రీనివాసరావు, డి.శివాజీ వ్యవహరించారు.



విజేతలతో గురుకులం కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు స్పష్టంగా చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని వైఎస్సార్ సీపీ మూడవ క్లస్టర్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. స్థానిక లలితా నగర్ సచివాలయంలో మంగళవారం 3వ క్లస్టర్ పరిధిలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుంచి మొదలయ్యే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలన్నారు. పథకాలు ఎవరికైనా అందని ఎడల .. వారికి అందేటట్లు చూడాలన్నారు. పార్టీ కార్యకర్తలు అందరూ ప్రతి గడపనూ తప్పనిసరిగా సందర్శించి, జగన్ చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. సమావేశంలో గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, పార్టీ నాయకులు ప్రసాదుల హరినాథ్, నందం స్వామి, బాలాజీ రెడ్డి, అరిగెల బాబు, లంక ప్రసాద్, దుంగా మంగ, సుభాష్ రెడ్డి, నామాని వాసు, సబ్బారపు సూరిబాబు, సోదదాస్ సింగ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు



మురమండ ఎస్సీ పేటలో సమస్యలు తెలుసుకుంటున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీస్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మురమండ గ్రామంలోని ఎస్సీపేటను మంగళవారం ఆయన సందర్శించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఎంపీటీసీ మెల్లిమి మంగ గంగరాజు ఆయనకు వివరించారు. రోడ్లు, డ్రైనేజీలు, శ్మశాన వాటిక, అంబేడ్కర్ పార్కు తదితర సమస్యలను విన్నవించారు. స్పందించిన చందన నాగేశ్వర్ స్థానిక అధికారులతో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. డ్రైనేజీలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, మురమండ సర్పంచ్ అయినవల్లి రుక్మిణి వెంకటేశ్వర్లు, యర్రా సూర్యనారాయణ, ఉప సర్పంచ్ సత్యాల మమత రమేష్, స్థానిక నాయకులు కొప్పాక రమణ, పైడిమళ్ల శాంతకుమారి, అయినవల్లి ప్రసాద్, బలుగూరి గోవిందరావు, బీరక వీర వెంకట సత్యనారాయణ, గొల్లపల్లి ఉదయ్ పాల్గొన్నారు.

ముస్లింల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు

- వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ ఆరిఫ్
- సమావేశంలో పలు తీర్మానాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముస్లింల సమస్యలను తెలుసుకుని, వాటిని నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేసి, త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తున్నామని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. మంగళవారం జరిగిన జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యవర్గ సమావేశంలో వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, జిల్లా సబార్డినేట్‌లతో కలిసి పలు తీర్మానాలు చేశారు. ఇమామ్, మోజన్‌లకు ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనాల తీరును పరిశీలించి, స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. షాదీఖానాలు, ధార్మిక కేంద్రాల మరమ్మతులకు సంబంధించి ఎంతో కాలంగా ఉన్న డిమాండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా కబ్జాకు గురైన వక్ఫ్ బోర్డ్ ఆస్తులను గుర్తించామని, న్యాయపరమైన వివాదాలను త్వరితగతిన పరిష్కరించి అవి ముస్లిం సమాజానికి ఉపయోగపడే విధంగా చేస్తామని అన్నారు. ఇప్పటికే ఉర్దూ భాషను ప్రభుత్వం రెండవ అధికారిక భాషగా గుర్తించి, ఉర్దూ పూర్వ వైభవానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ అందజేస్తున్న పథకాల ద్వారా అత్యధికంగా పేదలు ఉన్న ముస్లిం సమాజం ఎంతో లాభపడుతోందన్నారు. అనంతరం రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్‌గా నియమితులైన సయ్యద్ హసీనా బేగంను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ వజీరుద్దీన్, జిల్లా అధికారి మహమ్మద్ షఫీ, జిల్లా సహాయకులు మహమ్మద్ జానీ, జిల్లా డైరెక్టర్లు షబ్బర్ బాషా, మహమ్మద్ జఫరుల్లా ఖాన్, షేక్ బిజిలానీ, సయ్యద్ రబ్బానీ, షేక్ ఇబ్రహీం, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆరిఫ్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాజమహేంద్రవరం రూరల్: పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. శిశుసంరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా మంగళవారం బొమ్మూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో ప్రత్యూష కుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువుల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సరైన సమయంలో వైద్య సహాయం తీసుకుంటే క్యాన్సర్ నుంచి మొదటి దశలోనే బయట పడగలమన్నారు. జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కె.విజయ కుమారి మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా శిశుసంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. డీపీహెచ్ఎన్‌వో జి.వసంతలక్ష్మి, సీడీపీవోలు సీహెచ్‌వీ నరసమ్మ, నాగమణి, హరితదళం స్వచ్ఛంద సంస్థ మేనేజర్ వై.చిట్టిబాబు, పారా లీగల్ వలంటీర్ పీబీ ప్రశాంతి పాల్గొన్నారు.

ఎల్ఐసీపై ఇంటింటా అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థలో పొదుపు చేసిన ప్రతి రూపాయి.. ప్రజల సంక్షేమానికి, దేశ నిర్మాణానికి ఉపయోగపడుతుందని ఎల్ఐసీ అఖిల భారత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. స్థానిక మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇంటింటికీ ఎల్ఐసీ పోస్టర్‌ను సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాదరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవిత బీమా సంస్థపై అవగాహన కల్పించడానికి పోస్టర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కోదండ రామ్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లోని 20 శాఖా కార్యాలయాల పరిధిలో సుమారు పది వేల పోస్టర్లు పంపిణీకి సిద్ధం చేశామన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు, సతీష్ తదితరులు

అధ్యక్షుడు జి.రాంబాబు మాట్లాడుతూ జీవిత బీమా సాధించిన ఘనతను ప్రజలకు వివరించి పాలసీల పునరుద్ధరణ, కొత్త పాలసీల తీసుకోవాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ బీఎస్ఎన్ మూర్తి, ఉద్యోగుల సంఘం నాయకులు శిరీష, మాథ్యూస్, సత్యదేవ, గన్నెయ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

19న అఖిల గాండ్ల, తెలికుల కార్తిక వనసమారాధన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అఖిల గాండ్ల, తెలికుల, దేవ తెలికుల సంఘీయుల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారానికి కార్యాచరణలో భాగంగా ఈ నెల 19న రాజమహేంద్రవరంలో కార్తిక వనసమారాధన శంఖారావం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఈ మేరకు కన్వీనర్లు నరవ గోపాలకృష్ణ, నరవ అనంతం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని చందన గార్డెన్స్‌లో జరిగే వన సమారాధన నిర్వహణకు మంగళవారం రాట ముహూర్తం చేశారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ నాయకుడు కోడి ప్రవీణ్‌తో పాటు సంఘ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నిర్వాహకులు నరవ గోపాలకృష్ణ, నరవ అనంతంతో పాటు విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, అఖిల గాండ్ల, తెలికుల, దేవ తెలికుల కార్పొరేషన్ అధ్యక్షురాలు సంకిస భవానీ ప్రియ, దేవ తెలికుల రాష్ట్ర అధ్యక్షుడు అడ్డాల వెంకట రాజు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సంఘం వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలకృష్ణ పేరును ప్రాంగణానికి, సభ జరిగే మైదానానికి అంబటి సుబ్బన్న అండ్ కంపెనీ, సింగవరపు సాయిబాబా బ్రదర్స్ అండ్ సన్స్ పేరు మీదుగా సభా వేదిక నిర్మాణం చేయనున్నట్టు వివరించారు. 19వ తేదీ ఆదివారం ఉదయం కోటిపల్లి బస్టాండ్ వద్ద నుంచి భారీ ర్యాలీగా సభా వేదిక వద్దకు చేరుకున్న తరువాత సంఘీయుల సమస్యలపై చర్చించి కార్తిక వనసమారాధన, శంఖారావం పూరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సింగవరపు సాయిబాబా, మురపాక వీర్రాజు, అంబటి గురుమూర్తి, కాశిన సత్యనారాయ, వసాది సత్యనారాయణ, పెదబాబు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నరవ గోపాలకృష్ణ, చిత్రంలో దాడి సత్యనారాయణ, భవానీ ప్రియ

ఆధారాలు చూపలేని చంద్రబాబు



రాజు, వైఎస్సార్ లీగల్ సెల్ కార్యదర్శి

కంబాలచెరువు: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 53 రోజులు సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ కేసుతో తనకు సంబంధం లేదని ఆధారాలు చూపించలేక పోతున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి పీవీవీఎస్‌బీ రాజు అన్నారు. లీగల్ సెల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీమెన్స్ కంపెనీ, డిజైన్ టెక్ ప్రతినిధుల సమావేశంలో చంద్రబాబు ఉన్నారన్నారు. జైలులో ఉన్నప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు.. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ పగ్గాలను ఆయన తనయుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు ఎందుకు అప్పగించలేదన్నారు. జగన్‌ను అన్యాయంగా జైలుకు పంపించింది చంద్రబాబు అని, ఆనాడు ఎర్రన్నాయుడు, కాంగ్రెస్ నాయకుడు శంకరరావుతో జగన్‌పై కేసులు వేయించారన్నారు. తెలంగాణలో ఓటుకు నోటు కేసులో దొరికిన చంద్రబాబుపై 36 చార్జ్‌షీట్లు ఉన్నాయన్నారు. అమరావతి విషయంలో చంద్రబాబు చేసిన తప్పిదం వల్లే రాష్ట్రానికి రాజధాని లేకుండాపోయిందన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బూంబూం బీరు, 999 తదితర బ్రాండ్ల మద్యం ప్రవేశపెట్టారన్నారు.

ఎస్‌బీఐ డీజీఎంకు వినతి

కడియం: స్టేట్‌బ్యాంక్ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రాకు నర్సరీ అసోసియేషన్ తరఫున అధ్యక్షుడు మల్లు పోలరాజు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ కార్యాలయం వద్దకు విచ్చేసిన డీజీఎంకు ముందుగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నర్సరీ రైతులకు రుణాలకు సంబంధించిన అంశాలపై ఎదురవుతున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కడియం బ్రాంచి మేనేజర్ మూర్తి, పాలక వర్గ సభ్యులు గాద నాగేశ్వరరావు, తాడాల బాలమురళీకృష్ణ, రావిపాటి రామకృష్ణ, కొండేపూడి నాగు, రాజేష్ పాల్గొన్నారు.

తెలుగుజాతికి నన్నయ మహోపకారం

సీటీఆర్ఐ: ఆదికవి నన్నయ వ్యాసభారతాన్ని ఆంధ్రీకరించి తెలుగుజాతికి మహోపకారం చేశారని ప్రముఖ సాహితీవేత్త ఎర్రా ప్రగడ రామకృష్ణ అన్నారు. స్థానిక ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల ఆవరణలో శరన్మండలి ఆధ్వర్యంలో మంగళవారం నన్నయ భట్టారక జయంతి సభ నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ 44 ఏళ్లుగా ఆదికవిపై ఇదే వేదికపై ఎందరో మహనీయులు ప్రసంగించి, నన్నయను మనకు వివిధ కోణాలలో ఆవిష్కరించారన్నారు. శరన్మండలి వంటి సంస్థలు ఇలాంటి సాహిత్య సేవ చేసి జాతికి మహోపకారం చేయడం అభినందనీయన్నారు. సభకు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి కుమారుడు, సీనియర్ జర్నలిస్టు మధునామూర్తి అధ్యక్షత వహించారు. ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల చైర్మన్ అసదుల్లా అహ్మద్ సభ ప్రారంభం చేశారు. తొలుత కళాశాల ప్రాంగణంలోని ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు, ఆదికవి నన్నయ, మధునాపంతుల, వైఎస్ నరసింహారావు విగ్రహాలకు అతిథులు పుష్పాంజలి సమర్పించారు.

- నేటి విద్యార్థులు చరిత్ర ప్రాధాన్యతను తెలుసుకోవాలని ప్రముఖ సాహితీవేత్త ప్రభల సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల ఆవరణలో మధునాపంతుల ట్రస్టు మంగళవారం నిర్వహించిన కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 31వ వర్ధంతి సభలో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. ముఖ్యవక్తను ట్రస్టు తరఫున కార్యదర్శి దినవహి బాపిరాజు, అసదుల్లా అహ్మద్, మధునామూర్తి ఘనంగా సత్కరించారు. నిమ్మలపూడి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహం పేరుతో మోసం

రాజమహేంద్రవరం రూరల్: టిడ్కో గృహాలలో ఫ్లాట్ ఇప్పిస్తానని అభిరామ్ అనే వ్యక్తి రూ.లక్ష తీసుకుని మోసం చేశాడంటూ వీఎల్‌పురానికి చెందని వల్లభరెడ్డి శశిదేవి మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. శశిదేవి వద్దకు అక్టోబర్ మొదటివారంలో ఒక వ్యక్తి వచ్చి తన పేరు అభిరామ్ ఎలియాస్ షేక్ నాగూర్ మీరావలీగా పరిచయం చేసుకున్నాడు. తమది పశివెదల గ్రామమని, నగరపాలక సంస్థ హౌసింగ్ విభాగంలో పనిచేస్తానని తెలిపారు. కలెక్టరేట్ వెనుక కడుతున్న టిడ్కో గృహాలలో ఫ్లాట్ ఇప్పిస్తానని, రూ.లక్ష తీసుకున్నాడు. అలాగే ఆమె మరికొంతమందిని అభిరామ్‌కు పరిచయం చేసింది. కొద్దిరోజుల తరువాత అతడి ఫోన్ పనిచేయకపోవడంతో నగరపాలకసంస్థ కార్యాలయానికి గత నెల 30వ తేదీన వెళ్లి వాకబు చేయగా అటువంటి వ్యక్తులు ఎవరూ లేరని తెలిసింది. బొమ్మూరు ఎస్సై మహమ్మద్ జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కొండేటి దుర్గారావును అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ ఆరు మద్యం బాటిళ్లు, 650 ఎంఎల్ ఐదు బీర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.